ప్రజాశక్తి
సోమవారం 21 జులై 2025
5
విజయనగరం

బహిరంగ ప్రదేశాల్లో
మద్యం తాగితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగించినా, విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి వకుల్ జిందాల్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. ఎస్‌పి ఆదేశాలతో పోలీసు అధికారులు శనివారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా లే-అవుట్లు, గ్రామ శివారు ప్రాంతాల్లో, నగర శివారు ప్రాంతాల్లో, బహిరంగంగా మద్యం సేవించిన వారిపై పోలీసు అధికారులు, సిబ్బంది డ్రోన్లతో దాడులు నిర్వహించారు. 19న ఒక్కరోజునే 255 కేసులు నమోదు చేశారు. విద్యా సంస్థలకు సమీపంలో పొగాకు ఉత్పత్తులు విక్రయించిన వారిపై 53 కేసులు నమోదు చేశారు.

అంగన్వాడీల మెడపై ఎఫ్ఆర్ఎస్ కత్తి

- లక్ష్యాలు పూర్తిచేయాలని వర్కర్లపై సిడిపిఒలు వేధింపులు
- సుమారు 25 వేల వరకు లబ్ధిదారుల తొలగింపు?
- నేడు సిడిపిఒ కార్యాలయాల వద్ద అంగన్వాడీల ధర్నా

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఐసిడిఎస్‌లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ముఖ గుర్తింపు వ్యవస్థ (ఎఫ్ఆర్ఎస్)తో అంగన్వాడీ వర్కర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో నెట్‌వర్క్ సరిగా పనిచేయక పోవడంతో ఎఫ్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తవడం లేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న సిడిపిఒలు అంగన్వాడీల మెడపై కత్తి పెట్టి ఆన్‌లైన్ చేయాలని ఒత్తిడి చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం జిల్లాలోని ఐసిడిఎస్ సిడిపిఒ కార్యాలయాల వద్ద అంగన్వాడీలు ధర్నాకు సిద్ధమవుతున్నారు.

విజయనగరం జిల్లాలో 11 ఐసిడిఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. జిల్లాలో 2206 ప్రధాన, 293 మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. బాల సంజీవని పథకంలో 2499 అంగన్వాడీ కేంద్రాల ద్వారా 7 నెలల నుంచి మూడేళ్ల పిల్లలు 47,992 మంది, 3 నుంచి ఆరేళ్ల 33,564 మంది, గర్భిణులు 7986 మంది, బాలింతలు 6621 మంది లబ్ధి పొందుతున్నారు. సుమారు అరు నెలల క్రితం ఎఫ్ఆర్ఎస్ పూర్తిచేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారమే గర్భిణులు, బాలింతలు, ఆర్నెల్ల నుంచి మూడేళ్ల పిల్లలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా టేక్ హోమ్ రేషన్ సేవలు పొందాలని షరతు పెట్టారు. అందుకోసం అంగన్వాడీలు మొబైల్ ఫోన్ ద్వారా మంత్రిత్వ శాఖ పోషణ్ యాప్‌లో లబ్ధిదారుల ముఖ గుర్తింపు వివరాలను తప్పనిసరిగా పొందుపరచాలి. ఎఫ్ఆర్ఎస్‌లో రిజిష్టర్ కాని వారికి టేక్ హోం రేషన్ ఇవ్వబోరని ఆదేశాలు జారీ చేశారు.

లబ్ధిదారులను తొలగించాలని ఆదేశం

ఐసిడిఎస్ కేంద్రాల్లో నమోదైన లబ్ధిదారుల్లో ఎఫ్ఆర్ఎస్ పూర్తికాని వారిని రద్దు చేయాలని సిడిపిఒలు అంగన్వాడీ టీచర్లపై ఒత్తిడి చేస్తున్నారు లేకుంటే ఉద్యోగం తొలగిస్తామని బెదిరిస్తున్నారు. ఎఫ్ఆర్ఎస్ పూర్తికాని వారిని తొలగిస్తే అంగన్వాడీ వర్కర్లపై లబ్ధిదారులు గొడవకు దిగే అవకాశాలు ఉన్నాయి. చాలా ప్రాంతాల్లో ఇటువంటి గొడవలూ జరుగుతున్నాయి. అధికారులు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఎఫ్ఆర్ఎస్ అయినా పూర్తి చేయాలని, లేకుంటే లబ్ధిదారులనైనా తొలగించాలని అంగన్వాడీలపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ఏం చేయాలో పాలుపోక అంగన్వాడీ వర్కర్లు ధర్నాకు సిద్ధమవుతున్నారు.

ఇదీ ఎఫ్ఆర్ఎస్ ప్రక్రియ

ఎఫ్ఆర్ఎస్‌లో అంగన్వాడీ లబ్ధిదారుల రిజిస్ట్రేషన్‌ను రెండు దశల్లో చేపట్టాలి. తొలుత మొబైల్‌లో లబ్ధిదారుల ఫొటో తీయాలి. రెండోది లబ్ధిదారుని ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్‌కు వచ్చే ఒటిపిని వెరిఫై చేయాలి. దీనిలో విఫలమైతే లబ్ధిదారుల జాబితా నుంచి తొలగిస్తారు. ఇటువంటి వారికి ఈ నెల ఒకటో తేది నుంచి టేక్ హోమ్ రేషన్ ఇవ్వవద్దని అంగన్వాడీ వర్కర్లకు ఆదేశాలు అందాయి. దీంతో గ్రామాల్లో చాలామంది ఎఫ్ఆర్ఎస్ పూర్తికాని లబ్ధిదారులు అంగన్వాడీ వర్కర్లతో గొడవలకు దిగుతున్నారు. భోగాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ వర్కర్లు, లబ్ధిదారుల మధ్య గొడవలు జరిగి, పోలీస్ స్టేషన్ ఫిర్యాదు వరకు వివాదం వెళ్లింది.

ఆహార భద్రత చట్ట ఉల్లంఘనే

వర్కర్లకు ఆదేశాలు అంది టేక్ హోం రేషన్ ఆపివేయడం అంటే కచ్చితంగా ఆహార భద్రత చట్టాన్ని ఉల్లంఘించడమే. గర్భిణులు, బాలింతలు, ఆర్నెల్ల నుంచి మూడేళ్ల పిల్లలకు అవసరమైన పోషకాహారాన్ని అందజేయాల్సిన అవసరాన్ని ఈ చట్టం తెలియజేస్తుంది. 2025-26 బడ్జెట్లో ప్రభుత్వం ప్రకటించిన మొత్తాన్ని న్యూట్రిషన్ కోసం ఖర్చు చేస్తుంది. కానీ, నిధులను నిలిపివేస్తామని కేంద్రం బెదిరించడం వల్ల పీడీ, సిడిపిఒలు అంగన్వాడీ వర్కర్లను వేధింపులకు గురిచేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఉద్యోగాల నుంచి తొలగిస్తామని అంగన్వాడీ ఉద్యోగులను బెదిరిస్తున్నట్లు తెలిసింది.

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకే

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎఫ్ఆర్ఎస్‌ను అమలు చేస్తున్నాం. ఐసిడిఎస్‌లో అక్రమాలను అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఎఫ్ఆర్ఎస్ నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశాలు వచ్చాయి. లబ్ధిదారులను తొలగించాలని ఎక్కడా చెప్పలేదు. లబ్ధిదారుల ఫొటోతోపాటు ఆధార్ కార్డు ఒటిపి సక్రమంగా అందిస్తే సరిపోతుంది.

- టి.విమలా రాణి, ఐసిడిఎస్ పీడీ, విజయనగరం

రైతుబజార్ స్థలం ప్రభుత్వానిదే

పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు ● నేడు చలో కలెక్టరేట్‌కు పిలుపు

రైతులతో కలిసి ఆధారాలను చూపిస్తున్న పిపిఎస్ఎస్, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పాత మహారాజా ఆస్పత్రి వద్ద ఉన్న రైతు బజార్ స్థలం రాజుది కాదని, అది బ్రిటీష్ కాలం నుంచి ప్రభుత్వ స్థలమేనని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు స్పష్టంచేశారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని అశోక్ గజపతి రాజు ఈ స్థలాన్ని కాజేయాలని ప్రయత్నించడం సరికాదన్నారు. అందుకు సంబంధించి ఆధారాలను ఆదివారం రైతు బజార్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బయటపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1922 నుంచి 1995 వరకు ఇక్కడ మహారాజా ప్రభుత్వ ఆస్పత్రి కొనసాగిందని, 1995లో దాన్ని వేరే చోటుకు తరలించారని తెలిపారు. ఆ స్థలంలో 1999లో ఇదే అశోక్ గజపతిరాజు రైతు బజార్ ఎలా ప్రారంభించారని ప్రశ్నించారు. ఇది రాజుల వారసుల స్థలమని చెప్పేందుకు ఎటువంటి ఆధారాలూ లేవని 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వమే సిసిఎల్ఎ కార్యాలయం నుంచి జిఒ ఇచ్చిందని గుర్తుచేశారు. రైతుబజార్‌ను అనువైన చోటికి తరలించాలని కలెక్టర్ చెప్పడం సరికాదన్నారు. 26 ఏళ్లుగా ప్రభుత్వ స్థలంలో నడుస్తున్న రైతుబజార్‌ని ఎత్తేసి రైతుల్ని రోడ్డున పడేయడం అన్యాయమన్నారు. ఇక్కడే రైతు బజార్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పోరాటంలో రైతులకు, వినియోగదారులకు అండగా ప్రజలంతా నిలవాలని కోరారు. ఈ సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, ఉత్తరంధ్ర అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ఎస్‌టి కమిషన్ ఛైర్మన్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

పార్వతీపురం మన్యం జిల్లాలో పలు గిరిజన సమస్యలను సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి.. ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకరరావు దృష్టికి తీసుకొచ్చారు. విజయనగరంలోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం కృష్ణమూర్తి.. ఆయన్ను కలిసి ఏజెన్సీలోని పలు సమస్యలను వివరించారు. కురుపాం నియోజకవర్గంతోపాటు ఇతర ఏజెన్సీ ప్రాంతాలలో ఇప్పటికీ మౌలిక సదుపాయాలు కొరవడిన పరిస్థితులున్నాయని తెలిపారు. నాణ్యమైన విద్య, వైద్యం అందడం లేదని చెప్పారు. మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు వైద్యం సహాయం పొందేందుకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, రహదారి సౌకర్యం లేనందున ఇబ్బందులు పడుతున్నారని కృష్ణమూర్తి తెలిపారు. కమిషన్ ఛైర్మన్ శంకరరావు స్పందిస్తూ ఏజెన్సీ ప్రాంతాల సమస్యలను తమ క్షేత్ర స్థాయి పర్యటనలో గుర్తించి ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

ఛైర్మన్‌కు వినతి అందిస్తున్న కృష్ణమూర్తి

మాట్లాడుతున్న ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు

ప్రతీ నియోజకవర్గంలో డిజిటల్ లైబ్రరీ

ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం పార్లమెంట్ స్థానం పరిధిలో ప్రతీ నియోజకవర్గంలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిజిటల్ లైబ్రరీ 24 గంటలూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. యోగా సెంటర్లను ఏర్పాటు చేయడానికి ఇప్పటికే ప్రతి నియోజకవర్గంలో స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ కూడా ఏర్పాటు చేస్తామని, వీటితో యువతకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని చెప్పారు. రాజాం నుంచి చీపురుపల్లి, ఎచ్చెర్ల.. ఇలా నాలుగు రోడ్లకు ప్రతిపాదన చేసినట్లు తెలిపారు. వీటిపై కేంద్రమంత్రి గడ్కరీని మరోసారి కలుస్తానన్నారు. గత ఏడాది కాలంలో సిఎం చంద్రబాబునాయుడు.. ఎమ్‌పిలతో నాలుగు సార్లు సమీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో వివిధ అంశాలపై 89 ప్రశ్నలను లేవనెత్తి, అత్యధిక ప్రశ్నలు వేసిన ఎమ్‌పిగా ఎన్నికైనట్లు తెలిపారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, అవనాపు విజయ్, కర్రోతు నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో భారీ వర్షం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి భారీ వర్షం కురిసింది. సుమారు గంటన్నర పాటు కురిసిన వర్షంతో గత నాలుగు రోజులుగా అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం లభించింది. వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఊరట కల్పించింది. సుమారుగా గంటన్నర పాటు వర్షం కురవడంతో నగరంలోని కాలువలు, రోడ్లు జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. ప్రధానంగా రోడ్లు నీటితో నిండి పోయి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించింది.

ఆండ్రకు జలకళ

అయినా ఆందోళనే

- అధ్వానంగా కుడి, ఎడమ కాలువలు
- పూడికతీతలూ చేపట్టని వైనం
- పంట పొలాలకు సాగు నీరు ప్రశ్నార్థకమే
- జైకా నిధులు ఏమైనట్టు?

కళకళలాడుతున్న ఆండ్ర జలాశయం

ప్రజాశక్తి - మెంటాడ

సాధారణంగా రిజర్వాయర్ నిండుకుండలా దర్శనమిస్తుంటే, ఆ ఆనందం రైతుల కళ్లల్లోనూ తొణికిసలాడుతుంది. పంటలకు సాగునీటికి ఢోకా ఉండదన్న నమ్మకమే అందుకు కారణం. ఆండ్ర రిజర్వాయరు ఆయకట్టు రైతుల పరిస్థితి అందుకు భిన్నం. ఎదురుగా ఆండ్ర రిజర్వాయరు నీటితో కళకళలాడుతూ కనిపిస్తున్నా, తమకు నీరు అందుతుందో? లేదో? అన్న ఆందోళన రైతుల్ని వెంటాడుతోంది. కుడి, ఎడమ కాలువలను చూస్తే ఈ విషయం బోధపడుతుంది. కనీసం పూడిక తీతలకు నోచుకోలేదు. దీంతో ఈ ఏడాదీ సాగునీరు ప్రశ్నార్థకమేనన్న భయం రైతులను కలవర పెడుతోంది.

మండలంలోని ఆండ్ర జలాశయం నీటితో కళకళలాడుతోంది. జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 146 మీటర్లు కాగా, ప్రస్తుతం 141 మీటర్ల నీటిమట్టం ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 140.38 మీటర్లు ఉండేది. అయినప్పటికీ జలాశయ అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పట్టించుకునే దాఖలాలు కానరాలేదు. 27 ఏళ్ల చరిత్ర కలిగిన ఆండ్ర జలాశయం పర్యాటక అభివృద్ధికీ నోచుకోలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 1998లో ఈ జలాశయానికి ప్రారంభోత్సవం చేశారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఆండ్ర ప్రాజెక్టు దయనీయంగా ఉండడం గమనార్హం.

పిచ్చి మొక్కలతో కుడి కాలువ

కుడి, ఎడమ కాలువల పరిస్థితి అధ్వానం

ఆండ్ర ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఈ కాలువల ద్వారా సుమారు 16 గ్రామాలకు పదివేల ఎకరాలకు సాగునీరు అందాలి. పూడికతీతలు లేకపోవడంతో పంట పొలాలకు సాగునీరు అందే ప రి స్థి తి కానరావడం లేదు. కుడి, ఎడమ కాలువల అనుబంధ పిల్ల కాలువలకు సాగునీరు వెళ్లే పరిస్థితి లేదు. గత ప్రభుత్వ హయాంలో 16 కోట్ల రూపాయలు జైకా నిధులు విడుదల చేశారు. కాలువల మరమ్మతులు, అభివృద్ధికి ఈ నిధులు ఖర్చు చేసినట్లు కాగితాలకే పరిమితమయ్యాయి తప్ప ఆచరణలో సాధ్యం కాలేదని చెప్పొచ్చు. ఇదే పరిస్థితి కొనసాగితే ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు ప్రశ్నార్థకమేనని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల పూడిక తీతలు, పిల్ల కాలువలకు మరమ్మతులు చేసేందుకు నిధులు మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

పర్యాటక కేంద్రం కలేనా?

గతంలో టిడిపి, కాంగ్రెస్, వైసిపి ప్రభుత్వాల హయాంలో ఆండ్ర ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ఆయా ప్రభుత్వ నేతలు హామీలు గుప్పించారు. ఇప్పటివరకు హామీలు వాగ్దానాలుగానే మిగిలాయి తప్ప ఆచరణ సాధ్యం కాలేదు. పర్యాటక ప్రదేశం అంతా పిచ్చి మొక్కలతో నిండి ఉంది.

మహిళలకు రక్షణ కరువు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, మహిళలకు రక్షణ కరువైందని మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో గడిచిన 13 నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలు ఇందుకు నిదర్శనమన్నారు. ఆదివారం నగరంలోని కోలగట్ల నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అభివృద్ధి, సంక్షేమ, ఆర్థిక ప్రగతి, మహిళా భద్రతకు ప్రాధాన్యత ఇస్తుంటే, మన రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం రాజ్యమేలడం సిగ్గుచేటన్నారు. మాజీ మంత్రి ఆర్‌కె రోజాపై నగరి ఎమ్మెల్యే భానుప్రకాశ్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో మహిళలను దూషించే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఓ మాజీ ప్రజాప్రతినిధికి రక్షణ లేకపోతే సాధారణ మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే రోజాపై అనుచిత వాఖ్యలు చేసిన నగరి ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల భద్రత పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే అటువంటి వ్యక్తులను పార్టీ నుంచి తొలగించాలని కోరారు. గుడ్లవల్లేరులో మహిళను చెట్టుకు కట్టేసిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణా జిల్లా జెడ్‌పి ఛైర్‌పర్సన్ యు.హారికపై టిడిపి, జనసేన మూకలు దౌర్జన్యం చేయడం నిజం కాదా? అని ప్రశ్నించారు. ఓ మహిళ హోంమంత్రిగా విధులు నిర్వహిస్తున్నా మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలను ఎందుకు నియంత్రించడం లేదని నిలదీశారు. 2024 ఎన్నికలకు ముందు మహిళల భద్రత కోసం మాట్లాడిన, సనాతన ధర్మం గురించి చెప్పిన పవన్ కళ్యాణ్ కీచకుల కిరాతకాలపై ఎందుకు ప్రశ్నించటం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైసిపి జిల్లా కార్యదర్శి దుప్పాడ సునీత, కార్పొరేటర్లు ఆల్తి సత్యకుమారి, పిన్నింటి కళావతి, తాళ్లపూడి సంతోషి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రావణి

ఉత్సాహంగా పారా అథ్లెటిక్స్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పరుగు పోటీలో పాల్గొన్న పారా అథ్లెట్లు

పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాజీవ్ క్రీడా మైదానంలో పారా జూనియర్, సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లా నుండి 13 నుండి 18 ఏళ్లలోపు పారా క్రీడాకారులు వంద మందికి పైగా ఈ పోటీల్లో పాల్గొనడం శుభపరిణామమన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు తురెళ్ల రాము, మన్యం జిల్లా అధ్యక్షులు చీమల రాంబాబు, ఇంటర్నేషనల్ మెడలిస్ట్ శివగంగా, పారా నేషనల్ స్విమ్మర్ రవి, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయండి

మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

టిడిపి కూటమి సూపర్‌సిక్స్ హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలని మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రజలకు సూచించారు. బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ఆదివారం నగరంలోని ధర్మపురిలో మూడోరోజు కొనసాగించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వంలో అందుకున్న పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు ఇంకా అమలు చేయలేదని కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసిన ప్రజలే ప్రశ్నించాలని, వైసిపి అండగా ఉంటుందని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వానికి, ఇప్పటి కూటమి ప్రభుత్వ పాలనకు తేడా గమనించాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌వివి రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారు నాయుడు, నగర అధ్యక్షులు ఆశపు వేణు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బొద్దాన అప్పారావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు గదుల సత్యలత, కార్పొరేటర్ పతివాడ గణపతిరావు పాల్గొన్నారు.

శృంగవరపుకోట, గజపతినగరంలో

- పౌష్టికాహారం, నాణ్యమైన విద్యను అందిస్తున్నాం
- 'ప్రజాశక్తి'తో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.అన్నపూర్ణ ముఖాముఖి

రూ.6 కోట్లతో వసతిగృహాల నిర్మాణం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

'జిల్లాలో రూ.4.67 కోట్లతో సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లకు మరమ్మతులు చేపడుతున్నాం. శృంగవరపుకోట, గజపతినగరం కళాశాల వసతిగృహాల నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరయ్యాయి. వసతిగృహాల్లో నాణ్యమైన, మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పౌష్టికాహారం అందించడమే ధ్యేయంగా చర్యలు తీసుకుంటున్నామ'ని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.అన్నపూర్ణ తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆమె ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో శాఖా పరంగా చేపడుతున్న చర్యలను వివరించారు. మరిన్ని వివరాలు..

జిల్లాలో ఎన్ని వసతి గృహాలు ఉన్నాయి.?

విజయనగరం జిల్లాలో కళాశాల వసతిగృహాలు 16, ప్రీ మెట్రిక్ వసతి గృహాలు 14 ఉన్నాయి. వీటిలో 20 బాలుర వసతి గృహాలు,10 బాలికలు వసతి గృహాలు ఉన్నాయి.

వసతిగృహాల్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు.?

30 వసతి గృహాలకు గాను ప్రీ మెట్రిక్ వసతిగృహాల్లో 1600 మందికి గాను 765 మంది, పోస్ట్ మెట్రిక్ వసతిగృహాల్లో 1600 మందికి గాను 1106 మంది విద్యార్థులు ఉన్నారు. డిగ్రీ ప్రవేశాలు జరిగితే పోస్ట్ మెట్రిక్ వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్య పూర్తి స్థాయిలో భర్తీ అవుతుంది. ప్రీ మెట్రిక్ వసతిగృహాల్లో విద్యార్థులను చేర్పించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. వార్డెన్లు గ్రామాలకు వెళ్లి వసతిగృహాల్లో సౌకర్యాల గురించి వివరించి, చేర్పించే ప్రక్రియ సాగుతోంది. నెలాఖరులోగా మరింత మంది విద్యార్థులు వసతిగృహాల్లో చేరేలా కృషి చేస్తున్నాం.

వసతిగృహాల్లో శాశ్వత భవనాలు ఎన్ని.? మరమ్మతులకు తీసుకున్న చర్యలేమిటి.?

సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాల్లో సొంత భవనాలు 23 ఉన్నాయి. 7 భవనాలు అద్దెకు తీసుకొని నిర్వహిస్తున్నాం. సొంత భవనాల మరమ్మతులకు ప్రభుత్వం రూ.4.67 కోట్లు మంజూరు చేసింది. వీటితో ఇప్పటికే మరమ్మతులు జరుగుతున్నాయి. శృంగవరపుకోటలో కళాశాల బాలికల వసతిగృహం, గజపతినగరం కళాశాల బాలుర వసతిగృహం నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరయ్యాయి.

వసతిగృహ విద్యార్థులకు 'తల్లికి వందనం' డబ్బులు జమయ్యాయా.?



తల్లికి వందనం పథకం కింద సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాల్లోని విద్యార్థులకు వారి ఖాతాల్లోనే డబ్బులు జమయ్యాయి. తల్లుల ఖాతాల్లో కాదు. అందుకోసమే విద్యార్థుల పేరిట బ్యాంకు, తపాలా శాఖలో అకౌంట్లు తెరవాలని సూచించాం. ఇంకా 317 మంది విద్యార్థులకు రావాల్సి ఉంది. ఎస్‌సి విద్యార్థులకు తల్లికి వందనం పథకంలో కేంద్రం వాటా 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం వాటా 40 శాతం జమ కానున్నాయి. వీరికి తపాలా శాఖలో అకౌంట్లు తెరవాలని చెప్పాం.

వసతిగృహాల్లో ఫలితాల మెరుగుదలకు, ఇతర సౌకర్యాల కల్పనకు చేపడుతున్న చర్యలేమిటి.?

ప్రధానంగా పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు భోజన వసతితోపాటు అకడమిక్ వైపు మెరుగుదల ఉండే విధంగా ప్రత్యేక చర్యలు జూన్ నుంచి ప్రారంభించాం. ఈ నెలలో జరిగిన పాఠ్యాంశాలపై క్విజ్, ప్రశ్నపత్రాలు తయారు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రతి నెలా ఈ ప్రక్రియ సాగుతుంది. నేనే క్విజ్, పరీక్షకు ప్రశ్నలు తయారు చేసి అందిస్తా. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వసతిగృహాల్లో స్టడీ అవర్స్ ఉంటాయి.

విద్యార్థులకు నోట్ బుక్‌లు, పెన్సిళ్లు, కావాల్సిన మెటీరియల్ అందించాం. పదోతరగతి విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఆల్ ఇన్ వన్ పుస్తకాలు ఇచ్చాం. ప్రతి నెలా వైద్యులతో పరీక్షలు చేయిస్తున్నాం. విద్యార్థులకు వసతి, విద్యను అందించే విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

మెనూ అమలు, మెస్, కాస్మోటిక్స్ ఛార్జీల చెల్లింపులు ఎలా ఉన్నాయి.?

వసతిగృహ విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం మెనూ అమల్లో రాజీ లేదు. ప్రతిరోజూ వసతిగృహాల్లో ఏం పెడుతున్నారో ఫొటోలు తీసి పంపించాలని ఆదేశించడంతోపాటు స్వీయ పర్యవేక్షణ చేపడుతున్నాం. కాస్మోటిక్స్ ఛార్జీలు 3 నుంచి 5 తరగతి విద్యార్థులకు బాలురకు నెలకు రూ120, బాలికలకు రూ.130, 5 తరగతి నుంచి కళాశాల విద్యార్థుల వరకు బాలురకు రూ.200, బాలికలకు రూ.250 అందిస్తున్నాం. మెస్ ఛార్జీలు 3 నుంచి 4 తరగతి విద్యార్థులకు రూ.1150, 5 నుంచి పదో తరగతి వరకు రూ.1400, కళాశాల విద్యార్థులకు రూ.1600 ఇస్తున్నాం.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పూర్తి స్థాయిలో విద్యార్థులకు అందించారా? లేకుంటే ఎంత బకాయి ఉంది.?

ఫీజు రీయింబర్స్‌మెంట్ గత ఏడాది (2024-25)లో 2,989 మంది విద్యార్థులకు రూ.3,35,05,392 మంజూరయ్యాయి. విద్యార్థులకు అందించాం. ఎంటిఎఫ్ కింద మంజూరైన రూ.53,06,800 కూడా అందించాం.



సామంతుల సోంబాబును అభినందిస్తున్న ఎమ్మెల్యే అతిథి

పార్టీ పరిశీలకులుగా సామంతుల

ప్రజాశక్తి - పూసపాటిరేగ

విజయనగరం మండలంలో టిడిపి కార్యకలాపాలు మరింత చురుగ్గా సాగించేందుకు గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసే కార్యక్రమానికి టిడిపి అధిష్టానం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ కమిటీలలో బూత్ ఇంఛార్జులు, యూనిట్ ఇంఛార్జులు నియామక ప్రక్రియను పర్యవేక్షించేందుకు పార్టీ నాయకత్వం పూసపాటిరేగ మండలంలోని కొవ్వాడకు చెందిన సామంతుల సోంబాబును విజయనగరం మండల పరిశీలకునిగా నియమించింది. ఈ సందర్భంగా సామంతుల సోంబాబు ఆదివారం విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అతిథి గజపతి రాజును మర్యాదపూర్వకంగా కలిసి, గ్రామ కమిటీల ఏర్పాటు, నియామక విధానం, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. పార్టీని బలపరిచే విధంగా కమిటీలు, ఇంఛార్జులు సమర్థవంతంగా పనిచేయాలనే దిశగా సూచనలు తీసుకున్నారు. తెలుగుదేశం పార్టీ మళ్లీ ప్రజల్లో విశ్వాసం పొందేందుకు అడుగులు వేస్తున్న ఈ సమయంలో, ఈ కమిటీలు కీలకంగా నిలవనున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆయనతోపాటు విజయనగరం రూరల్ మండల టిడిపి అధ్యక్షులు బొద్దల నరసింహారావు, ప్రధాన కార్యదర్శి గంట పోలినాయుడు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - వెంకాడ(భోగాపురం)

భోగాపురం మండలంలోని ఏ.రావివలస, అమటాం గ్రామాల్లో ఎమ్మెల్యే లోకం నాగమాధవి శనివారం రాత్రి పర్యటించారు. ఈ సందర్భంగా అమటాం గ్రామానికి చెందిన నొడగల నర్సింహులు మోకాలు చికిత్స కోసం సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.60వేలు అందజేశారు. ఈ నిధి ఈ పంచాయతీలో అందిన తొలి సహాయంగా చరిత్రలో నిలిచిందని ఆమె తెలిపారు. అనంతరం కొయ్యవానిపాలెంలో వెర్మికోసిస్‌తో బాధపడుతున్న ఉప్పాడ బంగారప్పని పరామర్శించి, తక్షణ సహాయంగా రూ.10వేలు అందించారు. త్వరలో సిఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట జనసేన నాయకులు ఉన్నారు.

కెఆర్‌పేట జంక్షన్ వద్ద రాకపోకలు నిలుపుదల

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కెఆర్‌పేట జంక్షన్ వద్ద కొత్తవలస నుంచి దేవరాపల్లి వెళ్లే ప్రధాన రోడ్డులో రైవాడ రిజర్వాయర్ నుంచి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు తాగునీటిని తరలించే కాలువపై నిర్మించిన కల్వర్టు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో మార్గంలో వాహనాల రాకపోకలను నిలుపుదల చేస్తూ కంచె ఏర్పాటు చేశారు. అత్యవసరమైతే కెఆర్‌పేట నుంచి అంకా జోతి మీదుగా వెళ్లాలని ఆర్ అండ్ బి జెఇ స్వామి తెలిపారు.

జోరువానలోనూ 'సుపరిపాలన తొలి అడుగు'

ప్రజాశక్తి - శృంగవరపుకోట

మండలంలోని కొట్టాం గ్రామంలో ఆదివారం జోరు వానలో 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ఇంటింటికీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలు గురించి వివరించారు. కరపత్రాలు పంచుతూ ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి పనులను, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామంలో మహిళలు, వృద్ధులు, వికలాంగులతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాణి, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జీఎస్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, రెడ్డి అప్పలసత్యం, యూనిట్ ఇంచార్జ్ గొర్లె రమణమూర్తి, బూత్ ఇంచార్జ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - బొబ్బిలి

విజయనగరంలో ఆగస్టు 19న జరగనున్న ఐద్వా జిల్లా మహాసభను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు కె.పుణ్యవతి కోరారు. పట్టణంలో ఆదివారం మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్, మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐద్వా నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మహాసభలో మహిళల సమస్యలపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. మహాసభకు మహిళలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఇనుప చక్రాల ట్రాక్టర్లు రోడ్లపై నడిపితే కఠిన చర్యలు: ఎస్ఐ

ప్రజాశక్తి - సంతకవిటి

వరినాట్లు వేసే సమయంలో ట్రాక్టర్లకు ఇనుప చక్రాలు బిగించి, రోడ్లపై నడిపితే కఠిన చర్యలు తప్పవని ట్రాక్టర్ డ్రైవర్లను సంతకవిటి ఎస్ఐ ఆర్.గోపాలరావు హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ట్రాక్టర్ డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ట్రాక్టర్ ఇనుప చక్రాల వల్ల రోడ్లు పాడవుతున్నాయని, నడిచినపడ మేరా, గుంతలు ఏర్పడి, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి ఇనుప చక్రాల ట్రాక్టర్లు, పొలాల్లో మాత్రమే ఉపయోగించాలని సూచించారు. పొలంలో ఉపయోగించినప్పుడు మాత్రమే ఇనుప చక్రాలను బిగించి, పని పూర్తయ్యాక మరల తీసివేయాలన్నారు. ఎవరైనా తారు రోడ్లపై ఇనుప చక్రాలతో వాహనాలను నడిపితే, కఠిన చర్యలు తప్పవన్నారు.

ప్రతి నెలా క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - గంట్యాడ

వసతి గృహాల్లో విద్యార్థులకు ప్రతి నెలా క్విజ్ పోటీలను నిర్వహించాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నపూర్ణ అన్నారు. ఆదివారం స్థానిక సాంఘిక సంక్షేమ వసతి గృహంలో నిర్వహించిన పోటీల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో విజయ ప్రమాణాలను స్థాయిని మెరుగుపరిచేందుకు ప్రతినెల మూడవ ఆదివారం క్విజ్ పోటీలు నిర్వహించనున్నామన్నారు. పదిమందిలో నిలబడి ధైర్యంగా మాట్లాడే విధంగా విద్యార్థులను తయారు చేయాలన్నారు. జిల్లాలో 30 హాస్టళ్లల్లో నిర్వహించాలని రానున్న పబ్లిక్ పరీక్షల్లో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ఉత్తీర్ణతశాతం రావాలని అన్నారు. జిల్లాలో అన్ని హాస్టళ్లల్లో ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలలో మంచి ప్రతిభను కనబరచిన విద్యార్థులకు డిడి అన్నపూర్ణ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి గొర్లె గోవింద, సన్యాసిరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మెడికల్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వైద్య సేవలు అందించాలని డిఎం అండ్ హెచ్ఒ జీవనరాణి ఆదేశించారు. ఆదివారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం కావడం వల్ల సీజనల్ వ్యాధులతో పాటుగా మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి రోగాలు ప్రబలే అవకాశం ఉందని అంటు వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలోని ఏరియా ఆసుపత్రి ఏజెన్సీకి ముఖ ద్వారంగా ఉండడంతో ఎఎస్ఆర్ జిల్లా అనంతగిరి మండలం నుండి అధికంగా రోగులు ఆసుపత్రికి వస్తూ ఉంటారని ఇప్పటివరకు ఆసుపత్రిలో రోగుల వివరాలను తెలుసుకున్నారు. ప్రస్తుతం డయేరియా కేసులు ఏమీ లేవని ఆమె అన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

పూసపాటిరేగ మండలంలోని కొనాడ జంక్షన్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందారు. పూసపాటిరేగ నుంచి నాతవలస వైపు ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు సర్వీసు రోడ్డు గుండా వెళుతుండగా బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో డోలా దామోదర్(26) మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే పోలీసులు సుందర పేట సిహెచ్‌సికి తరలించారు.

ఇంకెన్నాళ్లీ కష్టాలు..

- రైల్వే బ్రిడ్జి పనుల్లో జాప్యం
- మూడేళ్లు గడుస్తున్నా పూర్తి కాని ఆర్‌ఒబి నిర్మాణం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - చీపురుపల్లి

హౌరా టు చెన్నై మెయిన్ లైన్‌లో ఉన్న చీపురుపల్లి వద్ద రైల్వే బ్రిడ్జి పనులు చేపట్టి సుమారు మూడేళ్లు కావస్తుంది. కానీ ఇంకా ఆ పనులు పూర్తికాక ప్రజలతో పాటు ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నెలలలో పూర్తి చేస్తామని చెప్పిన అధికారులు మూడేళ్లు గడుస్తున్నప్పటికీ పనులు పూర్తి చేయకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

చీపురుపల్లి వద్ద రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి 2022లో సుమారు 13 కోట్ల రూపాయలను రైల్వే శాఖ (కేంద్ర ప్రభుత్వం) మంజూరు చేసింది. ఈ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి చీపురుపల్లిలో అప్పటి పాలకులు ఆర్‌టిసి, ఆర్‌అండ్‌బి, పోలీస్ శాఖల అధికారులతో పాటు రైల్వే శాఖ అధికారులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి త్వరితగతిని రైల్వే బ్రిడ్జి పనులుపూర్తి చేసేందుకు సమన్వయంతో పని చేయాలని ఆదేశించింది. అయితే అప్పటి నుండి పాత రైల్వే బ్రిడ్జిపై భారీ కేడ్లు వేసి విజయనగరం వైపు నుండి రాజాం వైపు వెళ్లే భారీ వాహనాల రాకపోకలు నివారించాలని అధికారులు నిర్ణయించారు. దీంతో పాత బ్రిడ్జిపై పెద్ద ఇనుప భీములను ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను నిలుపుదల చేసారు. అప్పటి నుండి చీపురుపల్లి ప్రాంత ప్రజల కష్టాలు మొదలయ్యాయి. సుమారు మూడు సంవత్సరాల 5 నెలలు కావస్తున్నప్పటికీ బ్రిడ్జి పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. త్వరితగతిని రైల్వే బ్రిడ్జి పనులు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలున్నప్పటికీ పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి.

నిర్మాణంలో ఉన్న వంతెన

రాజాం వెళ్లే బస్సులు రద్దు

రైల్వే బ్రిడ్జి పనులు నత్తనడకన సాగడంతో చీపురుపల్లి నుండి రాజాం, పాలకొండ వెళ్లాల్సిన ఎక్స్‌ప్రెస్ బస్సులు, పాసింజర్ బస్సులను ఎపిఎస్ ఆర్‌టిసి నడపలేకపోవడంతో రాజాం, పాలకొండ వెళ్లే ప్రజలు, వ్యాపారస్తులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. విశాఖపట్నం వయా విజయనగరం, చీపురుపల్లి, రాజాం, పాలకొండ వరకు ప్రతీ రోజు ప్రతీ పది నిమిషాలకు ఒక ఆర్టీసి బస్సు ఉండేది. దీని కారణంగా నిరంతరం వేలాది మంది ప్రజలు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రయాణాలు చేసేవారు. బ్రిడ్జి పనులు పూర్తి కాకపోవడంతో విశాఖపట్నం నుండి విజయనగరం, చీపురుపల్లి మీదుగా రాజాం, పాలకొండ వెళ్లాల్సిన బస్సులు రద్దు చేయడంతో మూడేళ్ల నుండి ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజల కష్టాలను దృష్టిలో పెట్టుకొని పాలకులు చొరవ తీసుకొని రైల్వే బ్రిడ్జి పనులు వేగవంతం చేసేందుకు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి తమకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అంబెలెన్స్‌లకు తప్పని తిప్పలు

దూర ప్రాంతాల నుండి అంబులెన్స్‌లో చీపురుపల్లి మీదుగా విజయనగరం తీసుకువెళ్లే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి పనులు జరగక పోవడంతో అత్యవసర పరిస్థితులలో పక్కనున్న గుంతల రోడ్డు నుండి అంబులెన్స్‌లు వెల్లలేక రోగులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రైల్వే బ్రిడ్జి నిర్మాణపు పనులు ఎప్పుడు పూర్తవుతాయని స్థానికులు, వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. పనులు పూర్తి చేసి తమ కష్టాలను గట్టెక్కించాలని పలువురు కోరుతున్నారు.

మెమో 57ను తక్షణమే అమలు చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

2003 ముందు నియామకం పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేసి వారికి పాత పింఛను విధానాన్ని వెంటనే అమలు చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కౌన్సెలర్ జెసి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎపిటిఎఫ్ కార్యాలయంలో ఫెడరేషన్ శ్రేణులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మెమో 57ను జారీ చేసి ఏళ్ళు గడుస్తున్నా దాన్ని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుందన్నారు. తద్వారా 2003కు ముందు ఉద్యోగ నియామకం పొందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. 2023 జులై నుండి ఉద్యోగులకు 12వ వేతన సవరణ జరగాల్సి ఉండగా రెండేళ్లు గడుస్తున్నా నేటికి ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయకపోవటం ఉద్యోగ, ఉపాధ్యాయుల, పింఛనుదారులను తీవ్ర నిరాశకు గురిచేస్తుందన్నారు. తక్షణమే 12వ వేతన సంఘాన్ని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల శాఖ అధ్యక్షులు సిహెచ్‌జె ప్రవీణ్ కుమార్, చిన్నారావు, అర్‌ఎన్ రాజు, రమేష్, దర్శనం, శ్రీనివాస్, పాల్గొన్నారు.

వైజ్ఞానిక దృక్పథంతోనే నూతన ఆవిష్కరణలు

ప్రజాశక్తి- బొబ్బిలి

వైజ్ఞానిక దృక్పథంతోనే నూతన ఆవిష్కరణలు సాధ్యమని విశాఖకు చెందిన ఎకనామిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ కె.పద్మ అన్నారు. ఆదివారం స్థానిక ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో జన విజ్ఞాన వేదిక బొబ్బిలి డివిజన్ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షులు పి.సత్యం నాయుడు అధ్యక్షతన విద్యారంగం.. వైజ్ఞానిక దృక్పథం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో ప్రొఫెసర్ డాక్టర్ కె.పద్మావతి ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో మంచి మార్పులకు విద్య ప్రాధాన్యత కలిగిన ఛోదకశక్తి అని, అటువంటి విద్యారంగంలో పనిచేస్తున్న మనం ఆనాడు, ఈనాడు విద్యారంగంలో వస్తున్న సంస్కరణలను అధ్యయనం చేసి వాటిపై అవగాహనతో ముందుకు వెళ్ళాలని అన్నారు. ప్రస్తుత విద్యారంగంలో సైన్స్‌కి, సూడో సైన్స్‌కి మధ్య తేడాను గమనించి ప్రచారంలోకి తీసుకెళ్ళాలన్నారు. ప్రస్తుతం శాస్త్రీయ దృక్పథం పెంపొందించగలిగే మార్గానికి కొన్ని ఆటంకాలు వస్తున్నాయని, దానికి కారణం విధానపరమైన నిర్ణయాలని అన్నారు. ఈనాడు ప్రభుత్వ విధానాలు కూడా విద్యార్థుల సృజనాత్మకతకు దోహదపడే విధంగా లేవన్నారు. అటువంటి విద్యారంగంలో శాస్త్రీయ దృక్పథం పెంచే దానికి మనమంతా కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు ఎంవిఎన్ వెంకటరావు జనవిజ్ఞాన వేదిక లక్ష్యాలను సమాజంలో విస్తృత ప్రచారంలో పెట్టాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ్ ప్రభాత్ సెప్టెంబర్‌లో విజయనగరంలో జరిగే రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ మాట్లాడుతూ శాస్త్రం తాలూకా గొప్పతనాన్ని గురజాడ గారి దేశమును ప్రేమించుమన్నా అనే గేయంను ఆచరణలో మనమంతా చేయాలని అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో సైన్స్ శాస్త్రాలు ప్రమాదంలో పడబోతున్నాయని, దీనికి నూతన జాతీయ విద్యావిధానం కూడా ఒక అంశంగా ఉందని అన్నారు. మూఢనమ్మకాల నిరోధక చట్టాన్ని అమలు చేయడం వల్ల ప్రజలు శాంతివంతంగా బతికే అవకాశం ఉంటుందని అన్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు కె.శివానందు యువత పాల్గొనాలని కోరారు .రాష్ట్ర మహాసభలు జయప్రదానికి నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక, శాస్త్రీయ దృక్పథం కోసం, పర్యావరణం కోసం విశేషమైన కృషి చేస్తున్న ప్రిన్స్‌పాల్ పురుషోత్తం, రవీంద్ర, ఎస్‌వి రమణమూర్తి, కృష్ణ దాసును సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు ఆనెం శ్రీనివాస్, శశిభూషణ్, బాల భాస్కర్, వి.రాంబాబు, శంబంగి శ్రీనివాస్, రామకృష్ణ, యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, మధుసూధనరావు, సుధాకర్, బత్తుల శ్రీనివాస్, మహేష్, పెన్షనర్ల సంఘం నాయకులు కె.సత్యన్నారాయణ, చంద్రినాయుడు, శ్రీరామమూర్తి, కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ పద్మ

రైతుల ఇబ్బందులు పట్టవా?

ప్రజాశక్తి - వంగర

రైతులకు గిట్టుబాటు ధర లేక, ఎరువులు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతుంటే కూటమి ప్రభుత్వానికి ఇవేమీ పట్టడం లేదని వైసిపి మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ కూటమి ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పర్యటనకు వచ్చిన ఆయన మద్దివలసలో విలేకరులతో మాట్లాడుతూ డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి, రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతుందని అన్నారు. చంద్రబాబు తన సొంత జిల్లాలో తనకు రాజకీయంగా బలమైన ప్రత్యర్థిగా పెద్దిరెడ్డి కుటుంబం ఉండటాన్ని జీర్ణించుకోలేక మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయించారని దీనిని ఖండిస్తున్నామన్నారు. వైసిపి పోరాట ఫలితంగానే కూటమి ప్రభుత్వం తల్లికి వందనం అమలు చేసినప్పటికీ చాలామందికి అందని పరిస్థితి ఉందన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు వేస్తున్నారని మండిపడ్డారు. సాధారణంగా రాజకీయాల్లో ఎవరైనా ప్రజలకు నాణ్యమైన విద్య వైద్యం అందిస్తామని హామీలు ఇస్తారు కానీ దీనికి భిన్నంగా చంద్రబాబు నాణ్యమైన మద్యం అందిస్తామని హామీ ఇచ్చి ఊరూరా బెల్ట్ షాపులు నిర్వహించి కల్తీ మద్యం అందిస్తున్నారని ఆరోపించారు. కూటమి నాయకులు ఇప్పటికైనా ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టి వైసిపి నాయకులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజాం నియోజకవర్గ వైసిపి ఇంఛార్జి డాక్టర్ తలే రాజేష్, వంగర ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వరరావు, యు.గణేష్ ముఖర్జీ, పోలిరెడ్డి రమేష్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

కేంద్ర ప్రభుత్వం ఇష్టాను సారంగా ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి ఉద్యోగులకు, కార్మికులకు తీరని అన్యాయం చేస్తుందని ప్రయివేటీ కరణ ఆపాలని సిఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ విమర్శించారు. రామభద్రపురంలో ఆదివారం సిఐటియు మండల సమన్వయ కమిటీ సమావేశం బలస శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లా డుతూ కార్పొరేట్లు కొమ్ముకాసే విధంగా దేశ సంపదను బిజెపి దోచి పెడుతోందని అన్నారు. ఇప్పటికే లేబర్ కోడ్ ఎత్తివేసి కార్మికులకు తీరని అన్యాయం చేశారని అన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి విద్యుత్ ఛార్జీలు అమాంతం పెంచారని తెలిపారు. స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం అమలు చేయకుండా వారి శ్రమని దోపిడీ చేశారని ఆరోపించారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలు పట్టించు కోవడం లేదని, నిత్యవసర ధరలు అమాం తం పెరుగుతున్నా అదుపుచేసే స్థితిలో లేరని అన్నారు. వీటిపై సిఐటియు రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరా టాలు చేయనుందని తెలిపారు. ఈ సంద ర్భంగా పోరాటాల మండల కన్వీనర్‌గా బలసా శ్రీను, కో కన్వీనర్లుగా జి.కుమారి, జి.అరుణ, మరో 17 మంది కమిటీ సభ్యులను నూతనంగా ఎన్నుకున్నారు. సమావేశంలో పంచాయతీ కార్మికులు రాధ, వెంకీ, కళావతి, రామకృష్ణ, భవానీ, శ్యామలతో పాటు అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు



అభివాదం చేస్తున్న సిఐటియు నాయకులు

వైఎస్‌ఆర్ ఉంటే రైతులకు న్యాయం జరిగేది

ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

వైఎస్ రాజశేఖర్ రెడ్డి బతికి ఉండి ఉంటే జిందాల్ కర్మాగారానికి భూములు ఇచ్చిన రైతులకు న్యాయం జరిగి ఉండేదని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. ఆదివారం ఎంపిడిఒ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిందాల్ అల్యూమినియం కర్మాగారం కారణంగా భూములు కోల్పోయిన రైతులు గత 25 రోజులుగా నిరసనలు చేస్తున్నారని వారి డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేయడానికి కూడా అవకాశం లేకపోవడం, పోలీసులు భావ ప్రకటన స్వేచ్ఛను అడ్డుకోవడమేనని అన్నారు. నిరసన దారులపై బైండోవర్ కేసులు పెట్టి బెదిరించడం సెక్షన్ 30 శాంతి భంగం నివారణ వంటి నిబంధనలు రైతులకు మాత్రమే ఎందుకు వర్తిస్తున్నాయని రాజకీయ సమావేశాలు, నిరుద్యోగ యువత సభలకు ఇదే నియమం వర్తించకపోవడం దారుణమని అన్నారు. మండల పరిధిలో కలెక్టర్, మంత్రులు ప్రెస్ మీట్స్ నిర్వహించకుండా భూమి కోల్పోయిన వారితో ముఖాముకి చర్చలు జరపకపోయిన ప్రభుత్వం జిందాల్ యాజమాన్యానికి ఎందుకు సహకరిస్తుందో తెలపాలన్నారు. జిందాల్ యాజమాన్యం రైతులకు ఇప్పటివరకు 80 కోట్లు చెల్లించిందని ఈరోజు జిందాల్ భూముల విలువ 2 వేల కోట్లకు పైగా పెరిగాయని దీంతో జిందాల్ యాజమాన్యం ఆ భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని చేయాలని చూస్తుందని అందుకే జిందాల్ భూములకు సంబంధించి నాలుగు పంచాయతీలలో భూముల రికార్డులు మాయం చేశారని అన్నారు. జిందాల్ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జి లేక రిటైర్డ్ జడ్జి సిబిఐ విచారణ చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కి లేఖ రాశామన్నారు.

250 సిసి కెమెరాలతో ప్రత్యేక నిఘా

రెండో పట్టణ సిఐ శ్రీనివాస్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు 250 సిసి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు టూ టౌన్ సిఐ టి.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఎస్‌పి వకుల్ జిందాల్, డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. 200 సిసి కెమెరాలకు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి నేరుగా కమాండ్ కంట్రోల్ రూమ్ కనెక్టింగ్ సిస్టమ్ ఉందని తెలిపారు. ఇటువంటి వ్యవస్థ రాష్ట్రంలో ఏ పోలీస్ స్టేషన్‌లోనూ లేదని చెప్పారు. సిసి కెమెరాల ఏర్పాటు వల్ల నేరస్తుల గుర్తింపు సులభవుతోందని, అందులో భాగంగానే ఇటీవల 30 కేసుల్లో నేరస్తులను గుర్తించామని తెలిపారు. రాత్రి 11 గంటల తర్వాత ఎవరైనా తిరిగితే విచారించి సరైన సమా ధానం చెప్పని వారిని పోలీస్ స్టేషన్‌కు తరలి స్తున్నామన్నారు. ప్రధానంగా లంకా పట్నం, వైఎస్‌ఆర్ నగర్, పూల్ బాగ్ కాలనీ, దాసన్నపేట, బాబా మెట్ట ప్రాంతాల్లో గం జాయి ఎక్కువ తాగే అవకాశం ఉంద న్నారు. అటువంటి ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రాంతాల్లో డోర్ టు డోర్ ప్రచారం నిర్వహి ంచి డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను వివరించా మన్నారు.

సంకల్పం కార్యక్రమం ద్వారా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. ఈవ్‌టీజింగ్ నిరోధానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతిరోజూ విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రధాన కూడళ్లలో పోలీసు గస్తీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిని ఐదు భాగాలుగా విభజించి రాత్రి సమయంలో ముమ్మరంగా గస్తీని ఏర్పాటు చేసి దొంగతనాలు, నేరాల నియంత్రణకు ప్రత్యేకమైన చర్యలు తీసుకుం టామని తెలిపారు. దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామ న్నారు. సిసి కెమెరాల ఏర్పాటు చేసేందుకు ప్రజలంతా ముందుకు రావాలని కోరారు. తరచూ నేరా లకు పాల్పడే బండి రాజుపై పీడీ యాక్టు ద్వారా చర్యలు తీసుకోవడం జరిగింద న్నారు. రెండో పట్టణ స్టేషన్ పరిధిలో సు మారు 20 జంక్షన్లలో ప్రతి చోటా పోలీసు సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశామని వెల్లడించారు.

చంద్రబాబు మోసాలను తిప్పికొట్టాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

చంద్ర బాబు మోసాలను తిప్పి కొట్టాలని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్ బాబు పిలుపు నిచ్చారు. ఆదివారం 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మొయిద విజయరాంపురంలో పర్యటించి బాబు మోసాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన చంద్ర బాబుకు తగిన బుద్ధి చెప్పాల న్నారు. ముఖ్యంగా అర్హులైన వారికి పింఛన్లు ఇవ్వకపోవడం మోసమన్నారు. సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి ఒకటి మాత్రమే ఇచ్చారని, ఉచిత బస్ కాస్తా జిల్లాకే పరిమితం చేసి మహిళలను నమ్మించి మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుం దన్నారు. అన్నదాతకు ఇంతవరకు అన్నదాత సుఖీభవ కూడా ఇవ్వకుండా మోసం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ల సుధారాణి, సీనియర్ నాయకులు మత్స సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షులు గదల సన్యాసి నాయుడు, వైస్ ఎంపిపి సారికి వైకుంఠంనాయుడు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు, ఎంపిటిసి పెను మత్స సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

రూ.49 లక్షలు మంజూరు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బల్లంక గ్రామం నుండి ఆనందపురం వెళ్లే రోడ్డులో కల్వర్డు కూలిపోవడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు కల్వర్టు నిర్మాణానికి నిధుల మంజూరు చేయాలని జివిఎంసి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్‌పి శ్రీభరత్ ఆధ్వర్యంలో డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, జివిఎంసి అధికారుల పాలక మండల సమావేశం ఏర్పాటు చేసి కల్వర్టు నిర్మాణానికి రూ. 49లక్షలు నిధులు మంజూరు చేశారు. త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేసి ఆరు గ్రామాలకు రాకపోకల ఇబ్బంది లేకుండా చూడాలని ఎమ్‌పి ఆదేశించారని త్వరలో పనులు ప్రారంభిస్తామని జివిఎంసి ఇంజనీర్ సురేంద్ర ప్రజాశక్తికి తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - బొబ్బిలి

పంచాయతీ రాజ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కలిసికట్టుగా కృషి చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.శ్రీరాములు, జిల్లా కోశాధికారి రవికుమార్ కోరారు. స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బి.శ్రీనివాసరావు, పి.కృపాల్, ఉపాధ్యక్షుడిగా బి.ఉమాదేవి, జాయింట్ సెక్రటరీగా సిహెచ్ రామినాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉమా మహేశ్వ రరావు, కోశాధికారిగా గోపాలకృష్ణతో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తామని నూతన కమిటీ సభ్యులు చెప్పారు.

రోడ్డును పరిశీలిస్తున్న గొంప కృష్ణ

విశాఖ-అరకు రోడ్డు పరిశీలన

శృంగవరపుకోట: పట్టణంలోని విశాఖ అరకు రహదారిలో ప్రభుత్వ కాలేజీ గ్రౌండ్ ఎదురుగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు వర్షపు నీరు రోడ్లపై నిలువ ఉండడంతో వాహనదారులకు పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇదే వ్యవహారం గత 20 రోజులుగా జరుగుతున్నప్పటికీ పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. ఈ విషయమై డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణకు స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదివారం నీరు నిల్వ ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌తో పాటు పంచాయతీ, ఆర్ అండ్‌బి, జలవనరుల శాఖ జిల్లా అధికారులు పరిశీలించి వెంటనే తగు చర్యలు చేపడతారని ఆయన తెలిపారు. ఆయన వెంట రాయవరపు చంద్రశేఖర్, జుత్తాడ రామసత్యం, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సెక్రెటరీగా చిప్పాడ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

రేషన్ డీలర్ల వికలాంగుల విభాగంలో రాష్ట్ర వికలాంగుల జాయింట్ సెక్రటరీగా పట్టణంలోని డిపో నెంబర్ 211 రేషన్ డీలర్ చిప్పాడ రమణను ఎన్నుకున్నారు. ఈ విషయమై చిప్పాడ రమణ చరవాణి ద్వారా మాట్లాడుతూ ఆదివారం విజయవాడలోని మాఖినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం ఎన్నిక జరిగిందని ఇందులో రాష్ట్ర వికలాంగుల జాయింట్ సెక్రెటరీగా తనను రాష్ట్ర రేషన్ డీలర్ ప్రెసిడెంట్ లీల మాధవరావు ఎంపిక చేశారని తెలిపారు.

ఉపాధ్యక్షులుగా చొక్కాపు

ప్రజాశక్తి- రామభద్రపురం

రాష్ట్ర రేషన్ డీలర్స్ ఉపాధ్యక్షులుగా రామభద్రపురానికి చెందిన డీలర్ చొక్కాపు రామారావు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం విజయవాడ మాకినేని బసవ పున్నయ్య ఆడిటోరియంలో రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన రాష్ట్ర కార్యదర్శి కొనడం ఉమాశంకరరావును కూడా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర డీలర్ల ఉపాధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ డీలర్లు ఎన్నాళ్ల నుంచో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు. ఈయన ఎన్నికపై పలువురు రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన గొంప శివ కుమార్ S/o లేటు గురుమూర్తి, Door No.144, మర్రి చెన్నారెడ్డి కోలనీ, కణపాక, విజయనగరం వారి తరుపున తెలియజేయుడము ఏమనగా నా క్లయింట్ SOP 7/2019 నెంబరులో ఉంటూ అందలి పిటిషనర్లు అయిన గొంప రామయ్యమ్మ వగైరాలతో రాజీపడి తేది 16-03-2024న లోక్ అదాలత్ కేసు నెం. 917/2024 అవార్డు పొందియున్నారు. సదరు అవార్డు ప్రకారం నా క్లయింటు అతని తండ్రి గారి మరణాంతరం ఉద్యోగానికి విజయనగరం మున్సిపల్ కమిషనర్ వార్కి దరఖాస్తు చేసుకొనియున్నారు. దీనిపై ఎవరికైనా ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల నేటి లగాయితు 7 దినములలోగా విజయనగరం మున్సిపల్ కమిషనర్ వార్కి మరియు ఈ క్రింది ఎడ్రాసు గల వార్కి తెలియజేయగలరు లేని యెడల ఎట్టి ఆక్షేపణలు లేవని తీర్మానించడం జరుగును.

శ్రీ కుంటుభక్త శ్రీనివాసరావు
అడ్వకేట్, నెల్లిమర్ల,
విజయనగరం,
సెల్: 9440282934